## క్లుప్తంగా

### వ్యాన్ ఢీకొని గాయపడిన వృద్ధురాలి మృతి


మృతురాలు కొండమ్మ

సీతమ్మధార: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మొక్క కొండమ్మ(70) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 24వ వార్డు గాంధీనగర్‌కు చెందిన కొండమ్మ రోడ్డు దాటుతుండగా.. నక్కవానిపాలెం పోస్ట్ ఆఫీస్ వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైంది. చికిత్స నిమిత్తం ఆమెను కుమారుడు కేజీహెచ్‌కు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కొండమ్మ మరణించింది. కుమారుడు అప్పల సూరిబాబు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రత్నం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షణ చేశారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### కొండవాలులో అభివృద్ధి పనుల పరిశీలన

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం కార్పొరేటర్ గంకల కవిత, జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ఇందిరానగర్–4లో నూతన సామాజిక భవన నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, జైభారత్‌నగర్ శ్మశానవాటికలో నిర్వహిస్తున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. వార్డు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతం చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, మహేష్, శకుంతల, సచివాలయ సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### దారికి అడ్డంగా చెత్తకుప్పలు


శివనగర్ రహదారిలో చెత్తకుప్పలు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ రోడ్డులో రెండు చోట్ల చెత్త కుప్పలుగా పోసి వదిలేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఎఫ్‌సీఐ గొడౌన్ నుంచి ఇటు మద్దిపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గం ఈ పరిస్థితి నెలకొంది. ఈ రహదారిలో రోజూ వందల మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. రోడ్డు పక్కన ఒక వైపు కాలువ.. మరో వైపు ఇళ్లు ఉన్నాయి. అందులో కొందమంది తమ కార్లను రోడ్డు పక్కనే పార్క్‌చేస్తారు. దీంతో ఈ రోడ్డు ఇరుగ్గా మారింది. దుర్వాసన, మురుగు, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నట్లు కొందరు స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అటు చెత్త.. ఇటు మురుగు

- శ్రీనివాస స్ట్రీట్‌లో కాలువలు ఘోరం
- కానరాని శుభ్రత చర్యలు
- చర్యలు చేపట్టాలని నివాసుల విజ్ఞప్తి


మద్దిపాలెం మసీదు వైపు నుంచి జనావాసాల మధ్యలో కాలువ


శ్రీనివాస స్ట్రీట్‌లో మురుగు నీరు, వ్యర్థాలతో పేరుకుపోయిన కాలువ

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెంలోని పలు ప్రాంతాల్లో కాలువలు ఘోరంగా మారాయి. చెత్త పేరుకుపోయి.. మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్దిపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డును ఆనుకుని పక్కనే ఉన్న పలు వీధుల్లో ఈ పరిస్థితి దర్శనమిస్తోంది. ఓ పక్క శానిటేషన్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నప్పటికీ.. సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

**పేరుకుపోయి వ్యర్థాలు.. దుర్వాసన**

మద్దిపాలెం శ్రీనివాస స్ట్రీట్‌లో జనావాసాల మధ్య ఉన్న ఓ ప్రధాన కాలువ దుస్థితి అధ్వానంగా ఉంది. ఈ కాలువ మద్దిపాలెం మసీదు మీదుగా జనావాసాల మధ్య నుంచి మద్దిపాలెం మెయిన్ రోడ్డుకు కనెక్ట్ అయి ఉంటుంది. అక్కడ నివసించే ప్రజలు పైఅంతస్తు నుంచి చెత్తను పడేయడం వల్ల కాలువలో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పైనుంచి కనెక్ట్ అయిన ఈ కాలువలో ఎక్కడ ఎవరు చెత్త పడేసినా సరే శ్రీనివాస స్ట్రీట్ వద్దకు వచ్చి ఇరుక్కుపోతోంది. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లలో అద్దెలకు నివసిస్తున్న పలువురు చెత్త పైనుంచి పారవేయడం వల్ల ఇలా పేరుకుపోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న మూడు బావులు చెత్త, ఇతర వ్యర్థాలతో కూరుకుపోవడంతో మూసేయాల్సి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

**పట్టించుకునే వారేరీ..?**

శ్రీనివాస స్ట్రీట్‌లో తాగునీటి సమస్య ఉంది. మున్సిపల్ కుళాయి నీరు వచ్చినా.. అరగంట కంటే ఎక్కువ రాదు. దీంతో అక్కడి ఇంటి యజమానులు నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు నివాసులు ఇంటి కిటికీల్లో నుంచి చెత్తను పడేస్తున్నారని పలువురు అంటున్నారు. వార్డు శానిటరీ అధికారి ఎవరో కూడా తెలియదని, అసలు ఎవరూ తమ ప్రాంతం వైపు రావడం లేదని, పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో పక్క దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల విష జ్వరాలు ప్రబలే అవకాశాలు కూడా మొండుగానే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు నుంచి ప్రవహిస్తున్న చిన్న కాలువలో నీరు నిల్వ ఉండిపోతోందని, కర్ర సహాయంతో నీటిని తోసి శుభ్రపరచుకుంటున్నామని నివాసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం**

మా ఏరియాలోని ప్రధాన కాలువలో చెత్తాచెదారం పడేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. చిన్న కాలువలు ఘోరంగా మారాయి. మూడు బావులు మూసేశాం. తాగునీటి సమస్య ఉంది. అధికారులు, నాయకులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. – ఎస్.రాజు, శ్రీనివాస స్ట్రీట్

## గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలపై మహిళలకు శిక్షణ

మురళీనగర్: గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం 5వ తరగతి అర్హత కలిగి చదవడం, రాయడం తెలిసి ఉన్న 18 నుంచి 45 ఏళ్ల వయసు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు, పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా విదేశాల్లోని మతపరమైన సంస్కృతీ సంప్రదాయాలు, వారి జీవన విధానాలు, అలవాట్లు వంటి ముఖ్యమైన అంశాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆయా దేశాల చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

శిక్షణ అనంతరం మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాల చెల్లింపు, పనిచేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం బాధ్యత తీసుకుని తగిన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తీక్ 94942 02677 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. https://kaushalmahotsav.nsdcdigital.org/International/Candidate/ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

## శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్


శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పిస్తున్న ద్వారం త్యాగరాజు, మండపాక శారద

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో పలువురు సంగీత కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి


గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తారలెంతగా మెరిసెనో శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి రస హృదయాలను కట్టిపడేసింది. భయ్యా శ్రీనివాస్, సాత్విక పాడిన అబ్బ ముసురేసింది.. రాము, లయ పాడిన నీవులేక నేను లేను.. అభినయ్, శైలజ పాడిన అందం హిందోళం.. అమ్మాజీరావు, రేణుక పాడిన నా మది నిన్ను పిలిచింది.. మహమ్మద్ ఖాన్, గీత పాడిన చినుకు చినుకు అందెలతో.. సుధీర్, శైలు పాడిన ఇందిర మందిర సుందర.. సూర్యప్రభ పాడిన ఇది మల్లెల వేళయని గీతాలతో అలరించి ప్రేక్షకుల ప్రసంశలు అందుకున్నారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు ఎస్.ఫణిస్వామి, ఎం.వి.రాజశేఖర్, సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, వెంకటేష్, ఎంవీఆర్ నాగేశ్వరరావు, చింతా ప్రభాకర్, బుర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా 'లవ్ గైస్' లోగో పనులు



లవ్ గైస్ లోగో నమూనా


కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో లోగో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన ప్లాట్‌ఫామ్


మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంలో భాగంగా లవ్ గైస్ లోగో రూపకల్పన పనులు చురుగ్గా సాగుతున్నాయి. కళాశాల ప్రవేశ ద్వారం సమీపంలోని స్థలంలో దీన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీని కోసం ప్రత్యేకంగా వేదిక తయారు చేస్తున్నారు. మార్బుల్స్, గ్రానైట్ పనులు పూర్తయ్యాయి. లవ్ వైజాగ్ నమూనా తరహాలో దీన్ని రూపకల్పన చేశారు.

లవ్ అనేది తెలుగులోను, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్) అక్షరాలను ఇంగ్లిష్‌లోను రూపొందించారు. దీని ఏర్పాటుకు రూ.2.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇందుకు దాతల సహకారం తీసుకున్నారు. త్వరలో దీన్ని ప్రారంభిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు.

# మణిహారం

- కేజీహెచ్ గడియారానికి 200 ఏళ్లు
- బ్రిటీష్ కాలంలో ఏర్పాటు
- ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్న అధికారులు


వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా


గడియారం రిపేర్ చేయిస్తున్న వాచ్‌మేకర్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ వైపు చూడగానే మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది బ్రిటిష్ కాలం నాటి గడియారం. లండన్ నుంచి తీసుకొచ్చిన ఈ గడియారానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. ఆస్పత్రికి మణిహారంలా భాసిల్లే ఈ గడియారాన్ని నాటి బ్రిటిష్ పాలకులు దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అంత పురాతనమైనది అయినా కూడా ఈ గడియారం ఇప్పటికీ పని చేసేలా ఆస్పత్రి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఘన చరిత్ర కలిగిన ఈ గడియారం గతంలో ఒకసారి 40 ఏళ్ల పాటు మరమ్మతులకు గురై తిరగకుండా మొరాయించింది. దీంతో 1985లో ఆస్పత్రి అధికారులు స్థానిక వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్‌కు దీని మరమ్మతు బాధ్యతలు అప్పగించారు. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న ఆయన ఆగిపోయిన ఈ గడియారం పనిచేసేలా చేసి అధికారుల మన్ననలు పొందారు. అప్పటి నుంచి గడియారం పర్యవేక్షకుడిగా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. గడియారం నిరంతరం పని చేసేందుకు టైమ్ మిషన్లు ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ సమయంలో గడియారంలోని ముళ్లు విరిగిపోయాయి. గడియారం కూడా దెబ్బతింది. దీంతో వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా ప్రత్యేకంగా ముళ్లు తయారు చేసి అమర్చారు. ఈ గడియారంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులోని నిమిషాల ముళ్లు పొడవు 4 మీటర్లు, గంటల ముళ్లు పొడవు 3.5 మీటర్లు కాగా.. అంకెలన్నీ ఇనుముతో తయారయ్యాయి. చతురస్రాకారంలో గడియారం చుట్టూ గ్లాసమ్ బోర్డు అమర్చారు. రాత్రివేళ కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గడియారం పర్యవేక్షణకు ఏటా రూ.13 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్ని పెంచాలని వాచ్‌మేకర్ కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి జగన్‌ను మరోమారు ఆశీర్వదించండి


44వ వార్డులో కరపత్రం అందజేస్తున్న ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు


గణేష్‌నగర్‌లో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ


51వ వార్డులో కరపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతంపేట: గత నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోమారు ఆశీర్వదించాలని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు కోరారు. వార్డులోని రామచంద్రానగర్‌లో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ప్రజా మద్దతు సర్వేలోని 5 ప్రశ్నలకు సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. మద్దతు తెలిపిన ఇంటి యజమానితో 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించారు. అనంతరం వారి అనుమతితో ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించారు. కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గన్ని వెంకటరావు, దుర్గాప్రసాద్, హైమావతి, నాగమణి, గృహసారథులు, స్థానిక నాయకులు పాలికల గోపి, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'**

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 256 సచివాలయం పరిధి గణేష్‌నగర్‌లో కార్పొరేటర్ కంపా హనోకు సూచనలతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రభుత్వ పనితీరు గురించి ప్రజాభిప్రాయాలు సేకరించి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దుర్గేశ్వరరావు, గృహసారథి ఎం.ఈశ్వరరావు, వలంటీర్ ఎం.వాసంతి, పార్టీ శ్రేణులు సన్యాసప్పలనాయుడు, గణపతి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**51వ వార్డులో..**

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. 291 సచివాలయం పరిధిలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఇంటింటికీ వెళ్లి వారి అభిప్రాయాలు సేకరించి కార్యక్రమ స్టిక్కర్లు అతికించారు. 291 సచివాలయ కన్వీనర్ కరిమిరెడ్డి శ్యామ్, మెట్ట దమయంతి, 288 కన్వీనరు లత, అలేఖ్య, కృష్ణమోహన్, యశోద, తేజ, గృహసారథులతో కలిసి రెండు క్లస్టర్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

## మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌పై అనర్హత వేటు


ఉద్యమ పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దాబాగార్డెన్స్: ప్రధాని మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి పంపనున్న ఉద్యమ పోస్టు కార్డులను ప్రదర్శించారు. అనంతరం లక్కరాజు మాట్లాడుతూ మోదీ ప్రియమిత్రుడు అదానీకి రూ. 20 వేల కోట్లు ఎలా వచ్చాయో తెలపాలని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై కక్ష గట్టారని అన్నారు. దీనిని నిరసిస్తూ పెద్ద ఎత్తున పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు.

## సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కలిగియు వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు తొలి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన చేపట్టారు.

**కలియుగ వెంకన్న ఆలయంలో..**

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**నేడు కొత్తమ్మవారి ఆలయ వార్షికోత్సవం**

అల్లిపురం: అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారి ఆలయ 13వ వార్షికోత్సవం, ఉమాకాశీవిశ్వేశ్వర దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## ఈస్టర్ వేడుకలకు సర్వం సిద్ధం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసు క్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజాబలులు, ప్రార్థనలు నిర్వహించారు. రక్షకుడైన క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.




## ముగిసిన సీతారాముల ఉత్సవాలు

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీరామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా హనుమత్, సీతారామలక్ష్మణ విగ్రహాలను తిరువీధి ఉత్సవంగా బంగారుమెట్ట, కుమ్మరవీధి, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాలతో సందడిగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షుడు బీశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమాజం కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శనివారం కాన్వెంట్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మల్లారెడ్డి ప్రసాద్ అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మానవ హక్కుల కౌన్సిల్ సమావేశం నేడు

దాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఈ సమావేశంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బీఎస్ లత, కార్యదర్శి పైలా సన్యాసిరావు, డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్ చంద్రకళ, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎంజే రావును సమావేశంలో సత్కరించనున్నట్టు చెప్పారు. మానవ హక్కుల కమిషన్, కోర్టుల పనితీరుపై పలువురి ప్రసంగాలు ఉంటాయని శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

